క్లుప్తంగా

మహానందిలో పెళ్లి సందడి



దర్శనానికి వస్తున్న వధూవరులు

మహానంది: మహానంది ఆలయంలో పెళ్లిసందడి నెలకొంది. ఆలయ ప్రాంగణాల్లో వివాహాలు అధిక సంఖ్యలో జరగడంతో గురువారం ఆలయ ప్రాంగణాలు భక్తజనంతో కళకళలాడాయి. క్షేత్ర పరిధిలో సుమారు 15కు పైగా వివాహాలు జరగడంతో రద్దీ నెలకొంది. ఆలయానికి వచ్చిన నూతన వధూవరులు, వారి బంధుమిత్రులు శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని పూజలు చేపట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకు స్వామి,అమ్మవార్ల దర్శనం కొనసాగింది.

సెల్ టవర్ నిర్మాణం నిలిపివేయాలి

నందికొట్కూరు: జియోసెల్ టవర్ నిర్మాణం నిలిపివేయాలని సీపీఎం నాయకులు వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు కోరారు. గురువారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో తహసీల్దార్ రాజశేఖర్‌బాబు, మున్సిపల్ కమిషనర్ కిషోర్‌కు సీపీఎం నాయకులు 5వ వార్డు ప్రజలతో కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రజలు నివాసం ఉండే ప్రాంతంలో, సత్యనారాయణ దేవాలయం మధ్యలో సెల్ టవర్ నిర్మాణం ఎలా చేపడతారన్నారు. అధికారులు వెంటనే స్పందించి నివాసాల మధ్య నిర్మాణానికి పునాదులను నిలిపివేయాలన్నారు.

సేవా కార్యక్రమాలకు మారుపేరు ఆర్యవైశ్యులు

శ్రీశైలంటెంపుల్: ప్రజలకు, భక్తులకు విశేష సేవలందించేందుకు ఆర్యవైశ్యులు ముందుండి సేవా కార్యాక్రమాలకు మారుపేరుగా నిలుస్తున్నారని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. గురువారం శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను కుటుంబ సమేతంగా దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం స్థానిక వాసవిసత్రంలో వాసవి సముదాయాల అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్యవైశ్య ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆర్యవైశ్యులు అందించే సేవలు, సత్రాలకు సహకరిస్తున్న దాతలకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మల్లికార్జున సత్రం అధ్యక్షుడు శ్యాంసుందర్, సత్రం కమిటీ సభ్యులు, పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

టీబీ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ఆత్మకూరు: గ్రామీణ ప్రాంతాల్లో క్షయ వ్యాధిని నిర్మూలించి టీబీ రహిత సమాజాన్ని నిర్మిద్దామని టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ పవన్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధిలోని బాపనంతాపురం గ్రామంలో సచివాలయం వద్ద టీబీ ముక్త్ పంచాయతీ సమావేశం సర్పంచు దరగయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వారం రోజులు గడిచినా దగ్గు తగ్గపోతే టీబీ వ్యాధి పరీక్షలు చేయించుకోవాలన్నారు.కార్యక్రమంలో ఎంటీటీసీ సూపర్‌వైజర్ మస్తానయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీశైలానికి దేవదాయశాఖ మంత్రి రాక

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనార్థం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ శుక్రవారం రానున్నట్లు దేవస్థాన అధికారులు వెల్లడించారు. శుక్రవారం శ్రీశైలం చేరుకుని మంత్రి దంపతులు శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకుంటారన్నారు.

తల్లి అయిన మరుగుజ్జు మహిళ



ప్రసవించిన మహిళతో వైద్యులు

ఆత్మకూరు: పట్టణంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో ఓ మరుగుజ్జు మహిళ పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. మండల పరిధిలోని పెద్దానంతాపురం గ్రామానికి చెందిన మొండి గోవర్ధని మూడు అడుగుల మరుగుజ్జు మహిళ. ఈమెకు బుధవారం పురిటినొప్పులు రావడంతో ఆత్మకూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ గైనకాలజిస్ట్ డాక్టర్ జరీనా తాజ్ అనస్తీసియా, డాక్టర్ సలాం, పీడియాట్రిక్ డాక్టర్ వినోద్, డాక్టర్ మన్సూర్‌బాషా ఆధ్వర్యంలో మహిళకు సిజేరియన్ చేసి 1.8 కిలోల బరువు ఉన్న ఆడబిడ్డకు ప్రసవం చేశారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు తెలిపారు.

దత్తాత్రేయస్వామికి పూజలు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం గురువారం ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి దేవస్థానం ఈఓ , అర్చకులు విశేషపూజలను నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేశారు.



కర్నూలు జిల్లా పత్తికొండలో వైఎస్సార్ రైతు భరోసా పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఓర్వకల్లు విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్, రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి.

పల్లె చెంతకే పాలన

- సచివాలయాల రాకతో సొంత ఊరిలోనే సమస్యలకు పరిష్కారం
- అర్హత ఉంటే చాలు పథకాలు వెంటనే మంజూరు
- నూతన భవన నిర్మాణాలతో గ్రామాలకు కొత్త శోభ

శ్రీశైలం నియోజకవర్గంలో నూతనంగా నిర్మితమైన సచివాలయ భవనాల వివరాలు

మండలం	సచివాయాలు
ఆత్మకూరు	16
వెలుగోడు	10
మహానంది	13
బండిఆత్మకూరు	20
శ్రీశైలం	3



వెలుగోడు సచివాలయం,



నల్లకాల్వ గ్రామంలో సచివాలయం

ఆత్మకూరు: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక గాంధీజీ కలలు గన్న గ్రామస్వపరిపాలన పల్లెల చెంతకు దరిచేరింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీకి కట్టుబడి ప్రజల చెంతకే పాలన అందిస్తూ రాష్ట్ర ప్రజల మన్ననను పొందుతున్నారు. గ్రామపరిపాలన ప్రజలకు అందించడమే కాకుండా పరిపాలనా సౌలభ్యం కోసం నూతన కార్యాలయాల ఏర్పాటు చేశారు. వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి నూతన కార్యాలయాల భవనాలు నిర్మించారు. నూతన భవనాలతో పల్లెల్లో కొత్త శోభను సంతరించుకోవడమే కాకుండా గ్రామసర్పంచ్ మొదలు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, రెవెన్యూ, మండల ప్రజా పరిషత్ ఉద్యోగులు, వైద్య సిబ్బంది, వ్యవసాయ శాఖ ఇలా పలు కార్యాలయాల ఉద్యోగులు ఎన్నో సేవలు అందజేస్తూ ప్రశంసలు అందుకున్నారు.

రూ.కోట్లు ఖర్చు:

సచివాలయాల నిర్మాణం కోసం కోట్ల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసింది. సచివాలయానికి రూ.40 లక్షలు, సబ్‌సెంటర్ల కు రూ.17.5 లక్షలు, రైతు భరోసా కేంద్రాల రూ.23 లక్షలు, పాల కేంద్రాలకు రూ.14 లక్షలు చొప్పున ప్రభుత్వం ఒక్కొక్క సచివాలయపరిధిలో రూ.94.5లక్షలు మంజూరు చేసి నూతన కార్యాలయ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది.

సమస్యల సత్వర పరిష్కారం

గ్రామీణప్రాంతాల్లో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేయడం వల్ల సమస్యలకు సత్వర పరిష్కారం దొరుకుతోంది. ఇంటి స్థలాలు, రైతు భరోసా , పక్కాగృహాలు, వైఎస్సార్ చేయూత, ఆసరా లాంటి ఎన్నో పథకాలకు అర్హత ఉంటే వారి సొంత ఊరిలోనే సచివాలయం ద్వారా దక్కున అందుతున్నాయి. అదే టీడీపీ పాలనలో అయితే ఓ పథకం మంజూరు కావాలంటే ఆ మండల కార్యాలయానికి వెళ్లి అధికారులను, తెలుగు తమ్ముళ్ల చుట్టూ ప్రదక్షిణ చేస్తేకానీ పథకాలు వచ్చేవి కావు. కానీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రజల చెంతకే పాలన అందిస్తున్నారు.

ప్రజల చెంతకే పథకాలు అందిస్తున్నాం



సచివాలయ కేంద్రాల ఏర్పాటుతో పల్లెల్లో ప్రజా పాలన కొనసాగడం ప్రారంభమైంది. వలంటీర్ల సహకారంతో ప్రతి పల్లెలో రేషన్‌కార్డు మొదలు రైతన్నలకు, వృద్ధులకు, గ్రామ ప్రజలందరికీ ఇళ్ల స్థలాలు, పింఛన్లు, రైతు భరోసా ఇలా అన్నిరకాల ప్రజాసేవలు ఆయా పల్లెల్లోనే అందుతున్నాయి. ఫలితంగా ఆ గ్రామ ప్రజలు సుదూరంగా ఉన్న డివిజన్, మండల కేంద్రాలకు వెళ్లకుండానే వారివారి ప్రజాసంక్షేమ పథకాలు పొందుతున్నారు. అర్హత ఉంటే చాలు ప్రభుత్వ పథకాన్ని మంజూరు చేస్తున్నాం.

– మోహన్‌కుమార్, ఎంపీడీఓ , ఆత్మకూరు

సచివాలయాల్లోనే సమస్యలు పరిష్కరించుకుంటున్నాం



ప్రభుత్వ పథకాలకు సంబంధించి సమస్యలు ఉంటే నేరుగా సచివాలయాల వద్దకు వెళ్లి సమస్యలు తెలుపుతున్నాం. వారు ఆ సమస్య సంబంధించి ఫలానా అధికారికి సంబంధించి దరఖాస్తులు ఇలా చేయాలని చెబుతూ అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ పథకాల మంజూరుకు సచివాలయ వ్యవస్థ చేస్తున్న సేవ అభినందనీయం.

– మల్లికార్జున, ఆత్మకూరు

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి మా ప్రాంతంలోనే సచివాలయం ఏర్పాటు చేసి ప్రజల చెంతకే పాలన అందిస్తున్న గొప్ప నాయకుడు. పట్టణంలో ప్రభుత్వం ద్వారా అర్హత ఉన్న లబ్ధిదారులు సచివాలయానికి వెళ్లి ఇంటి స్థలాలు, పింఛన్లకు దరఖాస్తు చేసుకుంటే వెంటనే మంజూరు చేస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నాం

– అబ్దుల్‌కలాం, ఆత్మకూరు

డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

ఆత్మకూరు: ప్రభుత్వ డిగ్రీ కళాశాల అడ్మిషన్లు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ వెంకటనర్సమ్మ తెలిపారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కళాశాలలో బీఏ, బీకాం(సీఏ), బీజెడ్‌సీ, ఎంపీసీఎస్ గ్రూపులు ఉన్నాయన్నారు. ఇంటర్మీడియెట్ పూర్తి చేసుకున్న విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని కోరారు. ఎన్‌సీసీ, హాస్టల్ వసతి, స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 99637 31010 సెల్ నంబరుకు సంప్రదించాలన్నారు.

రేపు వాహనాల వేలం

ఆత్మకూరు: ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో సారా, అక్రమ మద్యం కేసులలో పట్టుబడిన వాహనాలను శనివారం స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 21 బైకులు, ఒక కారును వేలం వేయనున్నామని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు ఆధార్‌కార్డు వచ్చి స్టేషన్‌లో టోకెన్ తీసుకోవాలన్నారు. వివరాలకు స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ రమణ సెల్ 9849284381 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

భక్తులకు శీతలపానీయాలు

శ్రీశైలంటెంపుల్: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు 17 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సామాజిక సేవలో భాగంగా శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల భక్తులకు వేసవితాపం నుంచి ఉపశమనం కోసం శీతలపానీయాలు పంపిణీ చేశారు. గురువారం శ్రీశైలంలోని నంది మండపం వద్ద ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి భక్తులకు శీతల పానీయాలు అందజేసారు. ఏపీజీబీ మేనేజర్ శర్మ, ఫీల్డ్ ఆఫీసర్ వి.వి.జగదీష్ పాల్గొన్నారు.

ఘనంగా ఏపీజీబీ ఆవిర్భావ దినోత్సవం

వెలుగోడు: ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలందిస్తున్నదని ఆ బ్యాంకు మేనేజర్ అబ్దుల్ కలాం అన్నారు. స్థానిక బ్రాంచ్‌లో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ముఖ ఆధారిత హాజరు ప్రారంభం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో ఉద్యోగులకు ముఖ ఆధారిత హాజరు గురువారం నుంచి ప్రారంభమైంది. రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం నుంచి ముఖ చిత్ర హాజరును దేవస్థాన అధికారులు అమలు చేశారు. దీంతో మొదటి విడతగా వివరాలు నమోదు చేసుకున్న పలువురు ఉద్యోగులు తమ ముఖ చిత్రంతో తమ హాజరును నమోదు చేసుకున్నారు. ఉద్యోగులు కార్యాలయానికి వచ్చిన వెంటనే, అలాగే విధులు ముగించుకుని వెళ్లేటప్పుడు తప్పనిసరిగా ముఖ చిత్ర హాజరు ద్వారా నమోదు చేసుకోవాలి.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- చౌట్కూరు గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే

మిడుతూరు: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. గురువారం మండలపరిధిలోని చౌట్కూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రెండోరోజు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యే సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల పక్షాన ఉంటూ అన్ని సామాజిక వర్గాల అభివృద్ధికి కృషిచేయడంతోపాటు అర్హతే ప్రామాణికంగా భావించి సంక్షేమ ఫలాలు అందిస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డిని మరోమారు ఆశీర్వదించాలని కోరారు. అభివృద్ధిని చూసి ఓర్వలేని చంద్రబాబు , దత్తపుత్రుడు పవన్ కల్యాన్ ప్రభుత్వ పథకాలను అడ్డుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు 600 అబద్ధపు హామీలను ఇచ్చి ఒక్క పథకాన్ని కూడా సక్రమంగా అమలు చేయకుండా ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలేశారని గుర్తుచేశారు. మళ్లీ దొంగ హామీలను ప్రకటిస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. అనంతరం గడప గడప కార్యక్రమంలో వచ్చిన సమస్యలను పరిష్కారించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో చౌట్కూరు సర్పంచ్ మదార్‌సాహెబ్, ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి, తహసీల్దార్ సిరాజుద్దీన్, రూరల్ సీఐ సుధాకర్ రెడ్డి, నాయకులు జయరామిరెడ్డి, చాకలి స్వాములు, సాదిక్ , మహేష్, నాగటూరు సుధాకర్ రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానం ఉద్యోగుల బదిలీ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం సాధారణ బదిలీలలో భాగంగా ఇతర దేవస్థానాలకు బదిలీలు చేసింది. శ్రీశైల దేవస్థానంలో పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్(పీఆర్వో)గా విధులు నిర్వహిస్తున్న టీ.శ్రీనివాసరావును శ్రీకాళహస్తి దేవస్థానానికి ఏఈవోగా బదిలీ చేసింది. అలాగే సీనియర్ అసిస్టెంట్ ఎం.శ్రీనివాసరావును శ్రీకాళహస్తి దేవస్థానానికి, జూనియర్ అసిస్టెంట్‌లు కె.శ్రీనివాసులును శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానానికి, ఎం.చంద్రశేఖర్ రెడ్డిని మహానంది దేవస్థానానికి, ఎం.రాఘవేంద్రకుమార్‌ను శ్రీకాళహస్తి దేవస్థానానికి బదిలీ చేసింది. అలాగే నలుగురు జూనియర్ అసిస్టెంటులను ఇతర దేవస్థానాల నుంచి శ్రీశైల దేవస్థానానికి బదిలీ చేశారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు.

మహానంది దేవస్థానంలో నలుగురు..

మహానంది: మహానంది దేవస్థానంలో పనిచేస్తున్న నలుగురు ఉద్యోగులకు వివిధ దేవస్థానాలకు బదిలీ చేస్తూ దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డిని శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానానికి బదిలీ చేశారు. సీనియర్ అసిస్టెంట్ ఎం.నీలకంఠరాజు, జూనియర్ అసిస్టెంట్ టి.నాగమల్లయ్యలను కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయానికి బదిలీ అయ్యారు. ఎలక్ట్రీషియన్ వెంకటేశ్వర్లును శ్రీశైలానికి బదిలీ చేయగా, కాణిపాకంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించే కె.శ్రీధర్‌బాబు, శ్రీశైలంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎం.చంద్రశేఖర్‌రెడ్డిని మహానందికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

నందికొట్కూరు: లబ్ధిదారులతో చర్చించి జగనన్న లేఅవుట్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ ప్రభాకర్, తహసీల్దార్ రాజశేఖర్‌బాబు సచివాలయాల ఉద్యోగులను ఆదేశించారు. గురువారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో మున్సిపల్ కమిషనర్ కిశోర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నిర్మాణాలను వేగవంతం చేసేందుకు లబ్ధిదారులకు అన్ని విధాలుగా ప్రభుత్వం సహకరిస్తుందని చెప్పారు. సమావేశంలో సచివాలయాల ఉద్యోగులు, హౌసింగ్ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

పగిడ్యాల: నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం కింద ఇంటి నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎంపీడీఓ వెంకటరమణ ఆధ్వర్యంలో అధికారులు ఇంటింటికీ తిరిగి ఆరా తీశారు. గురువారం పగిడ్యాలలోని సీఎస్ఐ పాలెంలో విస్తృతంగా తిరిగి ఇళ్ల త్వరతిగతిన పూర్తి చేసుకోవాలని కోరారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే పరిష్కరించడానికి కృషి చేస్తామని చెప్పారు. అలాగే పడమర ప్రాతకోటలో ఉపాధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ కార్తిక్, ఆమని, సచివాలయ ఉద్యోగులు తదితరులు ఉన్నారు.

అలరించిన హరికథ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం నిత్య కళావేదికపై కర్నూలుకు చెందిన వై.సీతారామరాజు.. తులసీ జలంధర హరికథ నిర్వహించారు. హార్మోనియం సహకారాన్ని వై.జగదీశ్వరరావు, మృదంగ సహకారాన్ని పి.ప్రసాద్ అందించారు.



హరికథ వినిపిస్తున్న వై.సీతారామరాజు

తెల్లవారక ముందే అవ్వాతాతల చేతిలో పింఛన్



ఉపాధి పనులు చేస్తున్న గిరిజన మహిళ లచ్చమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ వేల్పుల దాసు



దుద్యాలలో కిడ్నీ వ్యాధి భారిన పడ్డ న్యామతుల్లాకు పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ జాకీర్

జూపాడుబంగ్లా: తెల్లవారకముందే తలుపుతట్టి పింఛన్ నగదు చేతిలోపెడుతూ వృద్ధులు, వితంతువులు, వికలాంగుల మోములో ఆనందం వెల్లివిరిసేలా చేస్తున్నారు వలంటీర్లు. గురువారం వలంటీర్లు తెల్లవారుజామునే పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. జూన్ మాసానికిగాను మండలంలోని 12 గ్రామపంచాయతీల్లో 5,000 మందికి పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ మంజులవాణి తెలిపారు. మధ్యాహ్నం 3గంటల ప్రాంతానికి వలంటీర్లు 3,831 మందికి పింఛన్లు పంపిణీచేసి జిల్లాలో మండలాన్ని మూడోవ స్థానంలో నిలిపినట్లు ఎంపీడీఓ తెలిపారు. మిగిలిన వారికి శుక్రవారం సాయంత్రంలోగా పంపిణీచేసి వందశాతం పింఛన్ల పంపిణీ ప్రక్రియ పూర్తిచేయనున్నట్లు తెలిపారు.

పని ప్రదేశంలోనే పింఛన్ పంపిణీ

కొత్తపల్లి: పేదప్రజలకు గ్రామాల్లోనే అన్ని సంక్షేమ పథకాలు, ఇతర సేవలు అందించేందుకు గ్రామవలంటీర్ వ్యవస్థను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారు. అందులో భాగంగా ప్రతినెల మొదటిరోజునే వలంటీర్లు లబ్ధిదారులకు వైఎస్సార్ పింఛన్ కానుకను పంపిణీ చేస్తున్నారు. ప్రజలు ఎక్కడ ఉంటే అక్కడికే వెళ్లి నగదు అందజేస్తున్నారు. జూన్‌నెల పింఛన్ పంపిణీని అన్ని గ్రామాల్లో వలంటీర్లు గురువారం మొదలు పెట్టారు. ఈ క్రమంలో ముసలిమడుగు గ్రామానికి చెందిన వేల్పుదాసు అనే గ్రామవలంటీర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు సుబ్బన్నతో కలసి గిరిజనులు అటవీ ప్రాంతంలో ఉపాధిపనులు చేసే ప్రదేశానికి వెళ్లి వారికి పింఛన్ పంపిణీ చేశాడు. అదేవిదంగా దుద్యాల గ్రామానికి చెందిన వలంటీర్ జాకీర్ న్యామతుల్లా అనే కిడ్నీ వ్యాధి గ్రస్తుడికి రూ.10వేలు అందించాడు. మండలంలో తొలిరోజు మొత్తం 70 శాతం వైఎస్సార్ పింఛన్ పంపిణీ పూర్తిచేశారని ఎంపీడీఓ మేరి తెలిపారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ హఠాన్మరణం

కొత్తపల్లి: మండలంలోని శివపురం గ్రామానికి చెందిన ఉపాధి కూలీ గుండెపోటుతో మృతిచెందాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల వివరాల మేరకు శివపురం గ్రామానికి చెందిన బత్తుల పుల్లయ్య గౌడ్(45) గురువారం ఉపాధి పనులకు వెళ్లాడు. ఫీడర్ ఛానల్ పనిచేస్తుండగా పని ప్రదేశంలో ఛాతీలో నొప్పి రావడంతో అక్కడే కుప్పకూలిపోయాడు. తోటి కూలీలు అక్కడే ఉన్న మేట్, ఫీల్డ్ అసిస్టెంట్‌కు సమాచారం ఇచ్చారు. పుల్లయ్య గౌడ్‌ను కుటుంబ సభ్యులు వైద్యం కోసం ఆత్మకూరు వైద్యశాలకు తీసుకువెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

మహానంది: బండిఆత్మకూరు మండలం జీసీ పాలెంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సుంకన్న(52) బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రెండ్రోజుల క్రితం నంద్యాలలోని ఓ ఆస్పత్రిలో చేరిన ఆయన చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందారని చెప్పారు.

అనారోగ్యంతో పూజారి..

మిడుతూరు: స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో పూజారిగా పనిచేస్తున్న పురాణం. వెంకటేశ్వర్లు (55) అనారోగ్యంతో బుధవారం సాయంత్రం మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఈఓ గుర్రెడ్డి గురువారం గ్రామానికి చేరుకొని దహన సంస్కారాల ఖర్చులకు దేవాదాయశాఖ తరుపున రూ. 10 వేలు పూజారి భార్య పద్మావతికి అందజేశారు.

ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలి

పాములపాడు/వెలుగోడు: మహిళా రెజ్లర్లను వేధింపులకు గురిచేసిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని ప్రజా సంఘాల నాయకులు గురువారం పాములపాడు, వెలుగోడులో నిరసన తెలిపారు. ఎంపీ దిష్టి బొమ్మను దహనం చేశారు. స్వాములు, కే రామదాసు పాల్గొన్నారు.

ఆందోళన పడొద్దు .. అది పులికాదు

కొత్తపల్లి: నీటిముంపు భూముల్లో పులి తిరుగుతుందన్నది పుకారేనని, అది పులి కాదని ఎవరు ఆందోళన పడాల్సిన అవసరం లేదని ముసలిమడుగు ఫారెస్ట్ అధికారి నాగేశ్వరరావు తెలిపారు. గురువారం రెండో రోజు కూడా పులి జాడ కోసం అటవీశాఖ అధికారులు మండలంలోని పాత బట్టువారిపల్లి మొదలుకొని నీటిముంపు ప్రాంతంలో డాగ్ స్క్వాడ్ బృందంతో కలిసి గాలించారు. ఆయన మాట్లాడుతూ బుధవారం కొత్తపల్లి మండలం పాతబట్టువారి పల్లి గ్రామ శివారులో ఉన్న ఆంజనేయస్వామి పరిసర ప్రాంతంలో అదే గ్రామానికి చెందిన వ్యక్తికి పులి కనిపించిందని ఫారెస్ట్ అధికారులకు సమాచారం తెలియజేశారన్నారు. దీంతో ఫారెస్ట్ అధికారులతో సంఘటనా స్థలానికి చేరుకొని నీటి ముంపు ప్రాంతాన్ని తనిఖీలు చేయించామన్నారు. అలాగే గురువారం కూడా తనిఖీలు చేయడంతో పాటు పులి కనిపించిందన్న వ్యక్తితో మాట్లాడామన్నారు. అతని నుంచి వచ్చిన సమాచారం మేరకు పులి కాదు కుక్క అయి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు.

పూడికతీత పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి

మహానంది: మిషన్ అమృత్ సరోవర్ పథకంలో భాగంగా చెరువుల్లో పూడికతీత, కట్ట బలోపేతం పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఈఈ బీవీ మధుసూదన్, డ్వామా ఏపీడీ బాలాజీ నాయక్ సూచించారు. నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ నియమించిన జిల్లా కమిటీ సభ్యులు గురువారం బండిఆత్మకూరు మండలం శింగవరం గ్రామ చెరువును పరిశీలించారు. రూ.4.13లక్షలతో చేపట్టిన పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. చెరువులోకి నీరు వచ్చే ప్రాంతంలో పూడికతీత పనులు చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వాసుదేవగుప్త, ఈసీ వరదరాజులు, టీఏ రోజా రాణి పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

పాములపాడు: ఆగస్టు నెలలో బాపట్లలో నిర్వహించే వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని బానకచెర్ల గ్రామంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం మండల స్థాయి నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఏసేపు, కార్యదర్శిగా తులసిప్రతాప్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, తిరుపాలు, బాషా, సహాయ కార్యదర్శి విజయ్‌కుమార్, సామేలు, కోశాధికారి ఉశేనమ్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గాలీవాన బీభత్సం

కొత్తపల్లి: మండలంలోని సింగరాజు పల్లి గ్రామంలో గురువారం సాయంత్రం గాలీవాన బీభత్సం సృష్టించింది. ఈదురు గాలుల, వర్షం కారణంగా గ్రామంలో ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న భారీ వృక్షం, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. గాలుల ధాటికి ఆంజనేయ స్వామి దేవాలయం పక్కన ఎన్నో సంవత్సరాల నుంచి భారీ వృక్షం ఒక్కసారిగా వేర్లతో సహా నేలవాలింది. దీంతో అక్కడే ఉన్న విద్యుత్ స్తంభాలు విరిగి పడడంతో తీగల కూడా తెగిపోయి గ్రామంలో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. విద్యుత్ స్తంబాలు పక్కన ఉన్న రేకులషెడ్లపై పడడంతో అవికూడా పడిపోయాయి. అలాగే గ్రామంలో ఉన్న బీసీకాలనీ, ఇతర కాలనీలలో ఉన్న వేప చెట్లు కూడా విరిగి పడ్డాయి. మండలంలోని గుమ్మడాపురం, ముసలిమడుగు, శివపురం, కొత్తపల్లి, గ్రామాలతోపాటు మరికొన్ని గ్రామాలలో చిరుజల్లులు పడ్డాయి.



గాలీవాన బీభత్సానికి నేలవాలిన భారీవృక్షం